నవతెలంగాణ
1
ఆదిలాబాద్
ఆదివారం | మే 26, 2024 | www.navatelangana.com

## గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని గిన్నెర గ్రామ చెరువులో శుక్రవారం ఈతకు వెళ్లి గల్లంతైన వ్యక్తి కుడ్మెత నితిన్(40) శవమై తేలాడు. ఎఎస్సై భీంరావ్, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..నితిన్ మూడు రోజుల మేన బావ ఇంటికి వచ్చాడు. శుక్రవారం తోయగూడ పరిసర ప్రాంతంలో దేవుళ్ల పూజకోసం వెళ్లాడు. పూజ అనంతరం సమీపంలోని చెరువులో ఈతకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాక పోవడంతో చెరువు గట్టు వద్దకు వెళ్లి చూడగా బట్టలు, చెప్పులు ఉండటంతో చెరువులో చూసినా ఆచూకీ లేక పోలీసులకు సమాచారం అందించారు. శనివారం గజ ఈతగాళ్లతో గాలించగా సాయంత్రం మృతదేహం లభించింది. తల్లి చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## క్యాన్సర్ బాధితుడికి రూ.50వేల ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ యువకుడికి ఆదిలాబాద్ పాయల్ ఫౌండేషన్ ఆర్థిక చేయుతనిచ్చింది. పట్టణంలోని దస్నాపూర్ కాలానికి చెందిన యువకుడు సాయితేజ ట్యూమర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా ఆపరేషన్ కొరకు ఆర్థికంగా అవసరం ఏర్పడింది. పాయల్ ఫౌండేషన్‌కు ఈ విషయం తెలియగా శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రూ.50వేల ఆర్థిక సహాయన్ని క్యాన్సర్ బాధిత కుటుంబీకులకు ఫౌండేషన్ చైర్మన్ శరత్ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, మయూర్ చంద్ర, సచిన్ ఉన్నారు.



# ముప్పు తప్పేనా..?

- కొనసాగుతున్న కడెం మరమ్మతు పనులు
- సబ్ స్టేషన్ నుంచే నేరుగా విద్యుత్ సరఫరా
- జూన్ 15లోపు పూర్తిచేసేందుకు ప్రణాళిక

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

**వర్షాకాలం ప్రారంభం కానున్న తరుణంలో అందరి దృష్టి కడెం ప్రాజెక్టుపైనే కేంద్రీకృతమవుతోంది. కిందటేడాది భారీ వరదల కారణంగా భయాందోళన రేకెత్తించిన విషయం తెలిసిందే. గేట్లు పనిచేయకపోవడం.. రెండు కౌంటర్ వెయిట్‌లు కొట్టుకుపోవడం కారణంగా నీరంతా కిందకు వదలాల్సిన పరిస్థితి తలెత్తింది. ఫలితంగా ఈ ప్రాజెక్టు కింది ప్రాంతాలు వరద ప్రభావానికి గురయ్యాయి. ఓ దశలో ఎక్కడ ప్రాజెక్టు కొట్టుకుపోతుందో అనే ఆందోళన సైతం వ్యక్తమైంది. తాజాగా ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో ప్రస్తుతం మరమ్మతు పనులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం గేట్లకు సంబంధించి పనులతో పాటు కౌంటర్ వెయిట్‌ల తయారీ, విద్యుద్ధీకరణ పనులు తదితర వాటిని వేగవంతం చేస్తున్నారు. జూన్ 15లోగా ఆయా పనులు పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మరో పక్షం రోజుల్లో జిల్లాలో వర్షాలు ప్రారంభం కానున్న దృష్ట్యా ఈ ప్రాజెక్టు పనులపైనే అందరూ దృష్టి సారిస్తున్నారు.**

ఉమ్మడి జిల్లా రైతాంగానికి సాగునీరందించడంలో కడెం ప్రాజెక్టుకి అత్యంత కీలకపాత్ర. ఈ ప్రాజెక్టు కింద ఏటా వేలాది ఎకరాలు సాగులోకి వస్తాయి. రెండు పంటలకు నీరందించే ఈ ప్రాజెక్టును కిందటేడాది భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. ప్రాజెక్టుకు సామర్థ్యానికి మించి వరద పోటెత్తడంతో కొన్ని గేట్లు తెరుచుకోకపోవడం.. కౌంటర్ వెయిట్‌లు కొట్టుకుపోవడంతో ప్రాజెక్టు మనుగడే ప్రమాదంలో పడింది. ఈ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 3.72లక్షల క్యూసెక్కులు కాగా ఏకంగా 6లక్షల క్యూసెక్కుల వరద రావడంతో ఆ సమయంలో ప్రాజెక్టు పరిస్థితిపై ప్రభుత్వం, అధికారుల్లోనూ ఆందోళన కలిగించింది. నీటిని కిందకు వదిలేయడంతో పరివాహక ప్రాంతాల్లో పంటలు నీటమునిగాయి. ఇండ్లలోకి వరద నీరు రావడంతో సమీప గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. అప్పటి ప్రభుత్వం మరమ్మతుల కోసం నిధులు విడుదల చేయకపోవడం తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. తాజాగా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల క్రితమే మరమ్మతుల కోసం రూ.5.46కోట్లు విడుదల చేయడంతో అధికారులు పనులు ప్రారంభించారు.

**కొనసాగుతున్న పనులు..!**

ఈ ప్రాజెక్టుకు మరమ్మతు పనులను జూన్ 15వ తేదీ లోపు పూర్తిచేయాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం గేట్లకు బేరింగ్‌లు, రబ్బర్ వాటర్ షీల్స్ బిగించడం, బ్రేక్ అలైన్‌మెంట్, గ్రీస్ అప్లై చేయడం, ప్యానల్ బోర్డులు బిగించడం.. రెండు గేట్లకు కౌంటర్ వెయిట్‌లు తయారుచేయడం వంటి పనులు చేపడుతున్నారు. మరోపక్క ఈ ప్రాజెక్టు విద్యుద్ధీకరణ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం మరో రూ.3.70కోట్లను కేటాయించింది. ఈ నిధులతో నేరుగా సబ్ స్టేషన్ నుంచే ప్రాజెక్టుకు విద్యుత్ సరఫరా అయ్యేలా కొత్తగా 500కేవీ సామర్థ్యం కలిగిన నూతన ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్, కొత్తగా వైరింగ్‌ను బిగించనున్నారు. మరోపక్క ఇక్కడ ఎలక్ట్రికల్ ఇంజనీర్‌లు లేకపోవడం సమస్యగా మారుతోంది. గత 20ఏండ్లుగా ఒక ఎలక్ట్రీషియన్ పనిచేస్తున్నారు. దీంతో ఇక్కడ కనీసం ఇద్దరు ఎలక్ట్రికల్ ఇంజనీర్లను నియమించాల్సిన అవసరముందని అధికారవర్గాలు చెబుతున్నాయి. మరోపక్క 1954లో నిర్మించిన ఈ ప్రాజెక్టు సర్వీసు కూడా పూర్తికావచ్చింది. ఇప్పటికే ఈ ప్రాజెక్టును సందర్శించిన కేంద్ర బృందం ఈ ప్రాజెక్టు గేట్లకు వంద మీటర్ల దూరంలో మరో 21గేట్లను ప్రతిపాధించడం గమనార్హం.



ప్రాజెక్టును సందర్శించిన అధికారుల బృందం(ఫైల్)

**గడువులోపు పూర్తయ్యేనా..?**

ప్రస్తుతం మరమ్మతు పనులు కొనసాగుతుండగా.. జూన్ 15తేదీలోపు పనులు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దయించారు. కానీ ప్రస్తుతం సగం పనులు పూర్తికావడం.. ఇంకా చేపట్టాల్సిన పనులు ఉండటంతో గడవులోపు పూర్తిఅవుతాయా అనేది అనుమానంగా మారుతోంది. ఒకవేళ పనులు పూర్తికాని పక్షంలో ప్రస్తుత గేట్లను పైకి లేపి ఉంచనున్నట్లు తెలిసింది.

తొలి దఫా వర్షాలు పడే సమయంలో ఇతర ప్రాంతాల నుంచి పెద్ద చెట్లు..మొద్దులు కొట్టుకువస్తుంటాయి. వాటిని సులువుగా కిందకు పంపించాలంటే గేట్లను ముందస్తుగానే పైకి లేపి ఉంచనున్నారు. పనులు పూర్తికాగానే గేట్లను మూసి వేసి నీటిని నిల్వ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోపక్క వరదలు రాకముందే పనులు పూర్తయితేనే బాగుంటుందని..

లేదంటే మరో ముంపు ముప్పును ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానిక రైతులు, జనాలు ఆందోళన చెందుతున్నారు.

**గడువులోపు పనులు పూర్తిచేస్తాం :**
**రవీందర్, ఎస్ఈ నీటిపారుదల శాఖ**



కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద వివిధ రకాల పనులు జరుగుతున్నాయి. జూన్ 15వ తేదీలోపు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. గడువులోపు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : డాక్టర్ సుధాకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రయివేటు ఆసుపత్రులలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్ అన్నారు. డిఎంఅండ్‌హెచ్‌వో తుకారాం భట్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని ప్రయివేటు ఆసుపత్రులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన వైద్యులు మాత్రమే చికిత్స అందజేయాలని పేర్కొన్నారు. లింగ నిర్ధారణ నిషేధమని, విరుద్ధంగా ఎవరైన లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం స్కానింగ్ సెంటర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సిద్ధార్థ, సునీల్‌రావు, నాగలక్ష్మి, ప్రశాంత్, సాయి, మణికాంత్, ఆస్పత్రి వైద్యులు శ్రీనివాస్, లక్ష్మి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ద్విచక్రవాహనం నడుపుతుండగా అదుపుతప్పి రోడ్డు ప్రమాదానికి గురైన ఘటన శనివారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు..మహారాష్ట్రలోని కృష్ణానగర్‌కు చెందిన నితీష్ తన భార్యను తీసుకొని ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దుబ్బగూడ వద్ద ఈ ఘటన జరిగింది. ప్రమాదంలో తీవ్రగాయాలైన నితీష్‌కు 108 అంబులెన్స్ సిబ్బంది రాజ్‌కుమార్, ముజఫర్ ప్రథమ చికిత్స అందించి రిమ్స్‌కు తరలించారు.

## వేసవి తాపానికి ఉపశమనం అంబలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం పెరుగుతున్న ఎండ తీవ్రత నేపథ్యంలో వేసవి తాపానికి అంబలి ఉపశమనం కలిగిస్తుందని ఆసిఫాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఉబెద్ బిన్ యాహియా(తారిక్) అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద తన ఖర్చులతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారసంత కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి జిల్లా కేంద్రానికి అనేకమంది వస్తారన్నారు. వారికి వేసవి తాపం నుండి ఉపశమనం కలిగించేందుకు అంబలి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమం ఇలాగే కొనసాగుతుందని వివరించారు. శనివారం దాదాపు 1500 మందికి అంబలి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లయన్ పుల్లూరు శంకర్, డైరెక్టర్ లయన్ నాంపల్లి శంకర్, అబ్దుల్లా, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభంకాగా శనివారం రెండో రోజు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం పరీక్షలు నిర్వహించగా, మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ పలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ సంవత్సర విద్యార్థుల కోసం రెండవ రోజు 8 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో 560 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 532 మంది మాత్రమే పరీక్ష రాసినట్లు, 28 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సర పరీక్షల్లో భాగంగా 8 సెంటర్లలో 319 మందిని కేటాయించగా, 312 మంది పరీక్షకు హాజరు కాగా, 7గురు గైర్హాజరయ్యారు.

# లైబ్రరీ నిర్మాణంతో నిరుద్యోగులకు ఊరట

- కలెక్టర్ చొరవతో త్వరగా ప్రారంభం
- విద్యుత్ సమస్యతో సతమతం
- తాత్కాలిక సిబ్బంది పరిస్థితి ఏమిటీ?

నవతెలంగాణ-ఆసిఫాబాద్

**జిల్లా ఆవిర్భావం తర్వాత జిల్లా కేంద్రంలో వివిధ మండలాల నుండి వచ్చి చదువుకునే నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. దీనికి తగ్గట్టు వసతులు లేకపోవడంతో గతంలో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. నిరుద్యోగులకు బాసటగా ఉండే విధంగా జిల్లా కేంద్ర గ్రంథాలయం నిర్మించాలనే నిర్ణయం మేరకు గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూర్బన్ పథకం కింద కోటీ50లక్షలతో ప్రస్తుత గ్రామీణ అభివృద్ధి శాఖాధికారి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో అన్ని వసతులతో జిల్లా కేంద్ర గ్రంథాలయం ప్రారంభమైంది.**

గతంలో జిల్లా కేంద్రంలోని లైబ్రరీ ఇరుకు గదులతో ఉండేది. దీంతో నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఇబ్బందిగా తయారైంది. జిల్లా కేంద్ర గ్రంథాలయ నిర్మాణం నిరుద్యోగులకు బాసటగా నిలిచింది. ప్రస్తుతం 150 మంది నిరుద్యోగులు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుత కలెక్టర్ వెంకటేష్ దోత్రే జిల్లాకు బదిలీపై రావడంతోనే లైబ్రరీ త్వరగా ప్రారంభించాలని నిర్ణయం తీసుకుని, ఆ పనిని అదనపు కలెక్టర్ దీపక్ తివారికి అప్పగించడంతో ఎన్నికల కోడ్ రాక మునుపే ప్రారంభించాలని దృఢ సంకల్పంతో పనులు వేగంగా జరిపించారు. మార్చి 15న మంత్రి సీతక్క చేతుల మీదుగా లైబ్రరీ ప్రారంభించి నిరుద్యోగుల కల నెరవేర్చారు.

**విద్యుత్ సమస్యతో సతమతం**

రెండంతస్తులతో అన్ని హంగులతో లైబ్రరీ ప్రారంభించారు. అయితే నిర్మాణంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.3లక్షలతో ఎస్టిమేషన్ తయారు చేశారు. నిర్మాణం పూర్తయ్యే నాటికి అవి రూ.4.50లక్షలకు చేరుకోవడంతో రీఎస్టిమేట్ చేయాల్సి వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో తాత్కాలికంగా ఒక మీటర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో ఫ్యాన్‌లు, కూలర్లు, ఏసీలతో పాటు బల్బులు ఒకే మీటర్ మీద నడవడంతో లోడ్ ఎక్కువై మధ్యాహ్నం విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గుతోంది. ఇదే విషయం విద్యుత్ శాఖ ఏఈని అడగగా త్వరలోనే ట్రాన్స్‌ఫార్మర్ బిగించనున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ పెడితే సమస్య తీరుతుందని వివరించారు.

**తాత్కాలిక సిబ్బంది పరిస్థితి ఏమిటి?**

ప్రస్తుతం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మొత్తం ఐదుగురు ఉద్యోగులు పని చేస్తున్నట్లు తెలిసింది. ఒక లైబ్రేరియన్, ఇద్దరు అసిస్టెంట్ లైబ్రేరియన్లు వీరితోపాటు ఇద్దరు స్వీపర్లు పనిచేస్తున్నారు. వీరిలో స్వీపర్లు తాత్కాలిక ప్రాతిపదికన 15 సంవత్సరాల నుండి పని చేస్తున్నారు. వీరికి వేతనాలు తక్కువ, పనికి భద్రత లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కాంట్రాక్టు ప్రాతిపదికలోకైనా మార్చాలని వేడుకుంటున్నారు.



చదువుకుంటున్న నిరుద్యోగ అభ్యర్థులు



**విద్యుత్ సమస్య పరిష్కరించాలి :**
**సందీప్, నిరుద్యోగ అభ్యర్థి**

గ్రంథాలయంలో వసతులు బాగానే ఉన్నప్పటికీ వేసవి కాలం కావడంతో విద్యుత్‌తో ఇబ్బందులు పడుతున్నాం. మధ్యాహ్నం పూట 30 నిమిషాల వరకు విద్యుత్ రావడం లేదు. వేడికి చదవలేకపోతున్నాం. సమస్య పరిష్కరించాలి.



**కాంట్రాక్టు ప్రాతిపదికకు మార్చాలి :**
**సలీం, స్వీపర్, తాత్కాలిక సిబ్బంది**

20 సంవత్సరాల నుండి లైబ్రరీలో పనిచేస్తున్నాను. ఇప్పటి వరకు తాత్కాలిక సిబ్బందిగా పని చేయడం బాధ కలుగుతోంది. తమ సర్వీసును కాంట్రాక్టు ప్రాతిపదికలోకి మార్చి పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కోరుతున్నా. అధికారులు, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

## ప్రమాదానికి గురైన కార్మికునికి సీఐటీయూ నాయకుల పరామర్శ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



క్యాతనపల్లి మున్సిపాలిటీలో విధులు నిర్వహించే ఎలక్ట్రీషన్ వి.కాంతారావు ప్రమాదానికి గురికాగా శనివారం సిఐటియు నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికునికి మెరుగైన వైద్యం అందించాలని, సేఫ్టీ లేకుండా పని చేయిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కనీస సేఫ్టీ పరికరాలు ఇవ్వకుండా చాలా ప్రమాదకర పరిస్థితులలో విధులను నిర్వహించేలా ఒత్తిడి చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పర్యవేక్షించి కార్మికులకు సేఫ్టీ పరికరాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పరామర్శించిన క్యాతన్‌పల్లి మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు గంధం మహేందర్ ఉన్నారు.

## లోకారి(బి)లో వైద్య శిబిరం

నవతెలంగాణ-నార్నూర్



రెండు రోజుల క్రితం కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన లోకారి(బి)లో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు బావిని పరిశీలించి నీటిని ల్యాబ్‌కు పంపించారు. గ్రామంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 30మందిని పరీక్షించగా అందరూ ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. రెండు రోజుల ముందు కురిసిన వర్షం నీరు బావిలో చేరిందని, ఆ నీటిని తాగడంతో అస్వస్థతకు గురైనట్టు అనుమానం వ్యక్తం చేశారు. వైద్య శిబిరంలో డాక్టర్ సంజీవ్, హెచ్ఎస్ సంజయ్, హెచ్ఈఓ గోకుల్, వైద్య సిబ్బంది కల్పన, ప్రకాశ్, వినోద్, పంచాయతీ కార్యదర్శి దుర్గం రాహుల్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | మే 26, 2024 | www.navatelangana.com


## ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను కలిసిన నాయకులు

నవతెలంగాణ-సిరికొండ



కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను ఆ పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న పార్లమెంట్ ఫలితాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలో పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రఘురాం, రంజాన్, కంచం లక్ష్మణ్, చంద్ర శేఖర్‌గౌడ్, రాజారాం, బాదు పటేల్, గంగాధర్, ఎర్రన్న, జంగు, గణేష్ పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఏఈఓ

నవతెలంగాణ-లోకేశ్వరం



రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని పొట్టపల్లి(ఎం) వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక సూచించారు. శనివారం లోకేశ్వరం మండలం హద్గాం గ్రామ పంచాయతీ అనుసంధాన మైన పొట్టపల్లి(ఎం) గ్రామ రైతులకు ఖరీఫ్ సీజన్ పట్ల అవగాహన కల్పించారు. విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి రశీదులు పొందాలని సూచించారు.

# పంచాయతీల ఖజానా ఖాళీ

- భారంగా మారిన నిర్వహణ
- ఇప్పటికే అప్పుల ఉబిలో పంచాయతీ కార్యదర్శులు
- కొన్ని పంచాయతీల్లో కార్మికులకు అందని వేతనాలు
- వచ్చేనెల నిర్వహణ, వేతనాలు అనుమానమే

నవతెలంగాణ-సిరికొండ

చిన్న గ్రామపంచాయతీలు ఏర్పడిన తర్వాత నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతినెల నిధులు మంజూరు చేసేవి, ఆయానిధుల సహాయంతో ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు పంచాయతీలలో పనులు చక్కగా చేయించి, అందరి మన్ననలు పొందేవారు. సర్పంచ్‌ల పాలన కాలంలోనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు లేకపోవడం, పార్లమెంట్ ఎన్నికల ప్రకటనాటి నుంచి కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయింది. వసూలు చేసిన ఇంటి పన్నులను, జనరల్ ఫండ్ ఖాతాలో జమ చేసిన కార్యదర్శులు ఏ అవసరం వచ్చిన ఆ ఖాతాలు నిధులను వినియోగించుకుంటూ కొంతకాలం వెళ్లదీశారు.

**పేరుకుపోతున్న అప్పులు**

గ్రామపంచాయతీలలో అరకొరగా ఉన్న నిధుల నిల్వలను విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐల చెల్లింపుకు వినియోగిస్తున్నారు. ఇతర ఏ అవసరం ఉన్న అప్పులు చేయక తప్పని పరిస్థితి. అంతే కాకుండా గ్రామపంచాయతీలలో గతంలో పనిచేసిన సర్పంచ్‌లు తమ పదవి కాలంలో చేసిన పనులకు నిధులు చెల్లింపు నేటికీ బకాయి గానే ఉండిపోయింది. ప్రతిరోజు పారిశుధ్య పనులలో భాగంగా ఇంటింటా చెత్త సేకరణ కోసం వినియోగించే ట్రాక్టర్ డీజిల్ కొనుగోలు కార్యదర్శిలకు సమస్యగా మారింది. వీటికి తోడు వేసవిలో నీటి నివారణ పేరుతో పైపులైన్లకు, చేతిపంపులకు మరమ్మతులు, ఉపాధి హామీ కూలీలకు తాగునీరు, నీడ సౌకర్యం నర్సరీలకు షెడ్‌నెట్, ఎరువులు, నీటి సౌకర్యం వంటి వన్ని అప్పులు చేసి సమకూర్చుకున్నవే. వర్షాలు సమీపిస్తున్నందున బ్లీచింగ్ పౌడర్ సిద్ధం చేయాలని, మురుగు కాలువలు శుభ్రం చేయించాలని నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి మట్టితో పూడ్చివేయాలన్న ఆదేశాలు కార్యదర్శులకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి.

**నామమాత్రంగానే ప్రత్యేక అధికారులు**

సర్పంచుల పదవీకాలం ముగియడంతో పంచాయతీలలో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. కానీ వారి పాలన నేడు నామమాత్రంగానే కనిపిస్తోంది. ఫైళ్లపై సంతకాలు చేయడానికి మినహా పంచాయతీల నిర్వహణ అభివృద్ధిలో వారి భాగస్వామ్యం శూన్యమేనని చెప్పాలి. ప్రస్తుతం పంచాయితీలలో నిధుల లేమి సమస్యగా మారడం, కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని స్థితి నెలకొనడంపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించడం అటు ఉంచితే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం కూడా చేయకపోవడం విచారకరం.

**వచ్చేది వర్షాకాలం...**

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో పారిశుధ్య పనులు ఆటకెక్కితే రానున్న రోజుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం లేకపోలేదు. అన్ని సక్రమంగా సాగిన సమయంలోనే దోమల బెడదతో ప్రజలు జ్వరాలు బారిన పడి తీవ్రంగా ఇబ్బంది పడేవారు. అటువంటిది పారిశుధ్య పనులు చేయకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో వేరే చెప్పనవుసరం లేదు.

**పాలనపై తీవ్ర ప్రభావం**

కాసింత పెద్ద పంచాయతీలకు ఆదాయం కొంత పర్వాలేదన్న స్థాయిలో సమకూరుతుంది. గతంలో మంజూరైన నిధులను పాతబకాయులకు చెల్లించకుండా అలాగే నిల్వ ఉంచుకున్న గ్రామపంచాయతీలో మినహాయిస్తే, చిన్న గ్రామపంచాయతీలతో పాటు మరికొన్ని పెద్ద గ్రామపంచాయతీలలో నేడు నిధులలేమి ప్రధాన సమస్యగా మారింది. వచ్చేనెల అత్యధిక గ్రామపంచాయతీలలో వేతనాలు ఇతర ఖర్చులు అటు ఉంచితే కనీస నిర్వహణ కూడా మరి భారంగా మారే పరిస్థితి నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తక్షణం నిధులు విడుదల చేయాలని, లేని పక్షంలో పంచాయతీలు పడకేసే ప్రమాదం ఉంది.



జీపీ ట్రాక్టర్ లో చెత్తను వేస్తున్న పంచాయతీ కార్మికులు

### నిధులు రావడం లేదు

**అరుణ్, సిరికొండ పంచాయతీ కార్యదర్శి**



నాలుగు నెలల నుంచి గ్రామ పంచాయతీకి నిధులు రావడం లేదు. దీంతో గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు అప్పులు చేయాల్సి వస్తోంది. సమస్యలను ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. కానీ జీపీలో నిధులు లేకపోవడంతో సమస్యలను పరిష్కరించలేకపోతున్నాం.

### నిధుల కొరత సమస్యగా ఉంది

**సంతోష్, ఎంపీఓ**



గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు లేకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. చాలామంది కార్యదర్శులు పంచాయతీ నిర్వాహణ విషయంలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని పంచాయతీలలో కార్మికుల వేతనాల చెల్లింపులు కూడా నిలిచిపోయాయి. సమస్యను ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్లాం.

## వారసంతల్లో తిప్పలు తప్పట్లేదు..



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని ప్రతి శనివారం జరిగే వారసంతకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వివిధ పనులు, సరుకులు, కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. సంతకు వచ్చిన ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత గ్రామపంచాయతీపై ఉంటుంది. వాహనాలకు పార్కింగ్, మూత్రశాలలు, మరుగుదొడ్లు లాంటి కనీస సౌకర్యాలు కల్పిస్తే సంతకు వచ్చిన ప్రజలు తమ పనులను సులభంగా చేసుకోవడంతో పాటు ప్రజలు ఎక్కువగా వస్తుంటారు. కాని మండల కేంద్రంలో నిర్వహించే సంతలో కనీస సౌకర్యాలు లేని కారణంగా సంతకు వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక పక్క పార్కింగ్ లేక వాహనాల రద్దీ, మరోపక్క మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ప్రజలకు తిప్పలు తప్పట్లేదు. ఎక్కడికి వెళ్లాలన్నా సుమారు కిలోమీటర్ దూరం వెళ్తేగాని సంతను దాటలేము. అలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంతలోనే వాహనాల పార్కింగ్ చేస్తు, ఇతర రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు సంతలోని సమస్యలు గుర్తించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని వడూరు గ్రామానికి చెందిన ఈరవ్వ ఇటీవల మరణించింది. శనివారం విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట బోథ్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ప్రెసిడెంట్ బద్దం పోతారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాములు, నాయుడి రవి, గంధం నవీన్, కుంట శంకర్, గాదె రవి, సుభాష్, జనార్దన్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సైన్స్ ఫెయిర్‌కు పొన్న విద్యార్థి



నవతెలంగాణ-సిరికొండ

అంతర్జాతీయ సైన్స్ ఫెయిర్‌కు మండలంలోని పొన్న గ్రామానికి చెందిన డోబ్లె రుషికేష్ ఎంపికయ్యాడు. దీంతో అతను జపాన్‌లోని సకుర సైన్స్ హైస్కూల్ ప్రోగ్రాం ఆఫ్ జపాన్ ద్వారా ఆ దేశాన్ని శనివారం సందర్శించారు. గతంలో ఫిబ్రవరి నెలలో జాతీయ స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ పోటీల్లో గర్భిణులు, దివ్యాంగులకు ప్రత్యేకంగా రూపొందించిన రైల్వే అభ్యర్థి నమూనాలు ప్రదర్శించాడు. అందుకుగాను కేంద్రం మంత్రి జితేంద్ర సింగ్ చేతుల మీదుగా అవార్డు సైతం అందుకున్నాడు. ఈ క్రమంలో అంతర్జాతీయ సైన్స్ ఫెయిర్‌కు ఎంపికై ప్రస్తుతం జపాన్‌లోని అంతర్జాతీయ సైన్స్ వేదికలో పాల్గొని, అతను చేసిన రైల్వే కోచ్ రీ డిజైనింగ్ గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు, మండల వాసులు జపాన్‌లో కూడా తన ప్రతిభను చాటి దేశ ప్రతిష్టను ప్రపంచానికి చాటి చేప్పేలా ఉండాలని అన్నారు. ఈ విద్యార్థి ఇచ్చోడలోని హై స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు.

## బాలుడి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్ కాలనికి చెందిన పసుపుల మీన కుమారుడు సిద్ధు 13 ఏండ్ల బాలుడికి బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్నాడు. కాగా ఆ బాలుడికి ఆస్పత్రిలో శస్త్ర చికిత్స కోసం దాదాపు రూ.3లక్షలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయమై బాలుడి తల్లి ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది. కాగా ఈ విషయం తెలుసుకున్న శ్రీరామ్ నగర్ కాలానికి చెందిన అల్లాడి వేణుశోభ అనే రెడీమేడ్ బట్టల వ్యాపారస్తుడు తమ వంతు సాయంగా రూ.10వేలు ఆర్థిక సాయాన్ని ఆ బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇంకా ఎవరైనా పెద్ద మనసు చేసుకొని తమకు ఆర్థిక సాయం చేసి తమ కుమారుడిని కాపాడాలని కోరుతున్నారు.

## ఆశ్రమాల్లో విద్యార్థులను చేర్పించాలి

నవతెలంగాణ-ఉట్నూర్



ఆశ్రమాల్లో విద్యార్థులను చేర్పించేలా అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా డీటీడీఓలు, ఏటీడీఓలు, ఏసీఎంఓ, జీసీడీఓ, ఎస్ఈఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలలు పున:ప్రారంభం కాక ముందే తాగునీరు, విద్యుత్ లాంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా నా దృష్టికి తీసుకురావాలని కోరారు. కొలాం, తోటి, కొలవార్ ఆదిమ గిరిజన విద్యార్థులకు హైదారాబాద్‌లోని హయత్‌నగర్ గిరిజన సంక్షేమ ప్రతిభ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ దిలీప్ కుమార్, ఈఈ రాథోడ్ భీంరావ్, డీటీడీఓ రమాదేవి, డీటీడీఓ గంగారాం, ఏటీడీఓలు పాల్గొన్నారు.

# జీలుగ విత్తనాల పంపిణీ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఆధ్వర్యంలో శనివారం రైతులకు 60శాతం రాయితీపై జీలుగ విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు పంపిణీ చేశారు. 2.5 ఎకరాకు 30 కేజీల బస్తా ధర రూ.1,116గా నిర్ణయించినట్టు వెల్లడించారు. ముందుగా రైతులు పట్టా పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం జీరాక్స్‌తో మండల కేంద్రంలోని రైతు వేదికలో టోకెన్లు తీసుకొని వ్యవసాయ సహకార సంఘంలో జీలుగ విత్తనాల బాగులను తీసుకున్నారు.



జీలుగ విత్తనాల టోకెన్లను తీసుకుంటున్న రైతులు

**జీలుగ విత్తనాల ఉపయోగాలను రైతులకు వివరించిన వ్యవసాయ శాఖ అధికారులు..**

జీలుగ మొలకెత్తిన తర్వాత పూత దశలో నేలలో కలియదున్నడంతో అధిక లాభాలు ఉంటాయని జీలుగ మురగకుండా వేరే పంటలు వేయకూడదని, జీలుగ పూర్తిగా మురిగిన తర్వాత నీటిని తొలగించి కొత్తనీరు పెట్టాలని తెలిపారు. జీలుగు సాగు చేసే పొలాల్లో నత్రజని తక్కువగా ఉంటే ఎకరానికి ఎనిమిది కిలోల నత్రజని వేయడం వల్ల మొక్క ఏపుగా పెరిగి రొట్ట ఎక్కువగా వస్తుంది. జీలుగు 12 నుంచి 24 కిలోలు ఎకరాన వాడితే 5 నుంచి 7 నత్రజని, 1 నుంచి 1.5 బాస్వరం, 7 నుంచి 8 పొటాష్ లభిస్తుందని అధికారులు రైతులకు తెలియజేశారు.గతంలో జీలుగ విత్తనాలు వాడిన రైతులు తమ అనుభవాలను తెలిపారు.

### అధిక దిగుబడి వస్తుంది

**లోలం చిన్నయ్య, రైతు, రాజూర**



నాకు 10 ఎకరాల వ్యవసాయ ఉంది. నేను 4 ఎకరాల్లో వరి సాగు చేస్తాను. వరి పంటలో అధిక దిగుబడులు కొరకు గతంలో చెరువులోని నల్ల మట్టిని, గొర్ల మందల ఎరువును కొని పంట పొలాల్లో చల్లి సాగు చేశాను. గతంలో వాటి ధరలు తక్కువగా ఉండేవి. కానీ ఇప్పుడు ధరలు పెరిగిన కారణంగా అధికారులు సూచన మేరకు జీలుగ విత్తనాలను వాడను. గతంలో లాగే ఇప్పుడు కూడా నాకు మంచి దిగుబడి వస్తుంది.

### రాయితీ జీలుగ విత్తనాల వైపే మొగ్గు చూపుతున్నాం

**గంగాధర్, రైతు, పొట్టపల్లి (ఎం)**



నాకు 12 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నేను 3 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తాను. జీలుగా విత్తనాలను గత 5 సంవత్సరాల నుంచి వాడుతున్నాను. జీలుగ వాడు తున్నప్పటి నుంచి వరి పంటలో ఎకరానికి 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

# జొన్నలు అమ్మకానికి వాహనాల బారులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రారంభమైన జొన్నల కొనుగోలు కేంద్రంలో దళారులు రంగ ప్రవేశం చేయడంతో జిల్లా ఉన్నతాధికారులు కొన్ని రోజులుగా జొన్నల కొనుగోలును నిలిపివేశారు. అసలైన రైతులకు న్యాయం చేయాలనే ఉద్యేశము తో పంచాయతీల వారిగా కార్యదర్శుల ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లున్న రైతుల పేరిట మాత్రమే టోకెన్లను జారీ చేశారు. పంటను అమ్ముకొనే సమయంలో కొనుగోలు కేంద్రంలో టోకెన్లపై పేర్లు ఉన్న రైతు ఉంటేనే కొనుగోలు చేయాలని మార్కెటింగ్ జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో గత పదిహేను రోజులుగా మూసి ఉన్న కొనుగోలు కేంద్రంలో ఈ నెల 24 నుంచి తిరిగి కొనుగోలును ప్రారంభించారు. ఐతే ఒక్కసారిగా రైతులు పంటను అమ్మకానికి తీసుకురావడంతో వాహనాలు బారులు తీరాయి. స్థానిక మార్కెట్ యార్డు గేటు నుంచి ప్రధాన రోడ్డుపై ఇరువైపులా పదుల సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. కొందరు దళారులు ఇక్కడ అక్రమ కొనుగోలుకు బ్రేక్ వేయడంతో పక్క మండలమైన ఉట్నూర్ కేంద్రంలో తరలిస్తున్నట్టు సమాచారం.

## డబుల్ రోడ్డు నిర్మాణానికి సహకరించాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలో డబుల్ రోడ్డు నిర్మాణానికి సహకరించాలని శనివారం డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావును లక్ష్మణచాంద గ్రామ వీడీసీ సభ్యులు కోరారు. స్పందించిన శ్రీహరిరావు డబుల్ రోడ్డు నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు నాలుగు ట్రిప్పులు నడిపించాలని ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అట్ల రాంరెడ్డి, మండల అధ్యక్షులు వోడ్నాల రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, నగేష్, అట్లా రవీందర్ రెడ్డి, సమ్మెట రవి, సుంకరి గంగయ్య, అట్ల శ్రీనివాస్‌రెడ్డి, రవి, జంగం రాజు, లక్కం రవి, ఈటెల పరమేష్, గోవింద్, రాజేశ్వర్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

## వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్

గ్రామాల్లో నిర్వహించే వైద్యశిబిరాలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రాంబాబు అన్నారు. శనివారం ఖంపూర్, చిత్తగూడ(కె) గ్రామంలో గర్భిణీ, బాలింతలకు ఆరోగ్యంపై వైద్య సిబ్బందితో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు చరణ్‌దాస్, సతవ్వ అవగాహన కల్పిస్తూ ప్రతి గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే నార్మల్ డెలివరీ, సిజేరియన్ డెలివరి కావాలని సూచించారు. గర్భిణులు నెలనెల నిర్వహించే స్కానింగ్ క్యాంపును వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యరాణి, లక్ష్మిబాయి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మిబాయి, గ్రామస్తులు ఉన్నారు.

## నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మార్కెట్‌లో నకిలీ విత్తనాలు చెలామని అవుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వ్యవసాయదారులు పనులు మొదలు పెట్టి మొట్టమొదటి పత్తి విత్తనాల కొనుగోలు అని, హాల్ మార్క్ చూసి ధ్రువీకరించబడిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని అన్నారు. విత్తనాలను కొనుగోలు చేసినపుడు కచ్చితంగా రశీదును తీసుకోవాలని, నకిలీ విత్తనాలను పొందితే బిల్ ద్వారా కోర్టు ద్వారా న్యాయం పొందవచ్చునని అన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలను అమ్మినట్లు తెలిసినట్లయితే స్థానిక వ్యవసాయ అధికారులకు గాని, పోలీసులకు గాని సమాచారం అందించాలని కోరారు.

## ప్యాకింగ్ లేని పత్తి విత్తనాలు కొనొద్దు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఎటువంటి ప్యాకింగ్ లేకుండా విడిగా అమ్మే ప్రతి విత్తనాలు రైతులు కొనుగోలు చేయకూడదని ఏఈఓలు మెస్రం రాము, జి.రాము తెలిపారు. మండలంలోని గోవిందపూర్, ఎల్లారం, గంటల గూడెం గ్రామాల్లో రైతులకు విత్తనాలకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడిగా సంచులలో ఉన్న పత్తి విత్తనాలు కొనుగోలు చేయకూడదన్నారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసినప్పుడే నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. గ్రామాల్లో విడి విత్తనాలు అమ్మితే వ్యవసాయ శాఖకు లేదా పోలీస్ శాఖకు సమాచారం అందించాలని సూచించారు.

## పంచాయతీ ఆస్తులు ప్రజలకు అందుబాటులోకి తేవాలి



నవతెలంగాణ-కౌటాల

పంచాయతీ ఆస్తులు ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా అందుబాటులోకి తేవాలని జిల్లా పంచాయతి అధికారి భిక్షపతి అన్నారు. శనివారం డిఎల్పిఓ సురేష్‌బాబుతో కలిసి మండలంలోని కౌటాల గ్రామ పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఆస్తులు, వాటి రక్షణ గురించి వివరించారు. అనంతరం పంచాయతిలో నర్సరీ, పల్లె ప్రకృతి వనం, బృహత్ ప్రకృతి వనం, శ్మశాన వాటిక, క్రీడా ప్రాంగణం, వర్మి కంపోస్టు తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతు పంచాయతీలోని ప్రతి ఆస్తి ప్రజలందరిదని, దానిని ప్రజలందరికీ ఉపయోగంగా తీసుకురావాలన్నారు. ఆస్తులను కాపాడుకుంటూ అభివృద్ధి దిశగా వెళ్లేలా ప్రతి కార్యదర్శి, సిబ్బంది పనులు చేయాలన్నారు. ప్రతి కార్యదర్శి విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు.

## కార్పొరేట్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

కార్పొరేట్ కళాశాలలో ప్రవేశం పొందేందుకు ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ వసతి గృహాలలో చదివి పదవ తరగతి పరీక్షల్లో 7 జిపిఏ, ఆపైన సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, దివ్యాంగ విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత కుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 30లోగా దరఖాస్తును డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. తెలంగాణ ఈ పాస్.సీజీజీ.ఇన్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9440628538 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## నకిలీ విత్తనాల కేసులో ఇద్దరికి రిమాండ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఓ గోదాంలో నకిలీ విత్తనాలు తయారు చేసిన కేసులో సామ అశోక్‌రెడ్డి, రాజేందర్‌లను రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ జీవన్ రెడ్డి శనివారం తెలిపారు. వీరిపై పలు సెక్షన్ల కింద మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు. వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు రశీదు బుక్కులు, దస్త్రాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులను గుర్తించినట్టు పేర్కొన్నారు.


## క్యాన్సర్ బాధితునికి ఆర్థిక సాయం




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న యువకుడు కాప్పే సాయితేజకు ముడుపు మౌనిష్‌రెడ్డి ఆర్థిక చేయూతనిచ్చారు. ఆదిలాబాద్‌లోని దస్నాపూర్‌కు చెందిన 22ఏండ్ల సాయితేజ గత కొన్ని నెలలుగా క్యాన్సర్ వ్యాధితో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యచికిత్స కోసం రూ.7లక్షలు ఖర్చు అవుతుందని తెలిసి, మనవాతాదృక్పతంతో స్పందించిన ముడుపు మౌనిష్‌రెడ్డి రూ. 40 వేలు శనివారం అందించారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## కళల పట్ల అభిరుచి పెంచుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కళల పట్ల అభిరుచి పెంచుకోవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ రామచంద్ర గోపాల కృష్ణ మఠం ఆవరణలో నిర్వహించిన అవంతి కూచిపూడి నృత్యోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు.

## 31లోపు సీట్లకు దరఖాస్తు గడువు

- ఎస్సీ గురుకుల సొసైటీ జిల్లా సమన్వయ అధికారి జేజే థెరిస్సా

నవతెలంగాణ-పెద్దపల్లి

మే 31లోపు ఎస్సీ గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి మిగిలిన జూనియర్ ఇంటర్ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ గురుకుల సొసైటీ జిల్లా సమన్వయ అధికారి జేజే.థెరిస్సా శనివారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి నాన్-సీఓఈ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, 2023-24లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మే 31లోపు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# జూన్ 5 వరకు ఏకరూప దుస్తులు అందించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వచ్చే విద్యా సంవత్సరంలో జూన్ 12వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభం అవుతాయని, ఈ క్రమంలో జూన్ 5వ తేదీలోగా విద్యార్థిని, విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఏకరూప దుస్తులను అందించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, అదనపు ప్రాజెక్టు అధికారి రామకృష్ణతో కలిసి సెర్ప్ అధికారులు, సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, ఐకేపీ కమ్యూనిటీ సమన్వయకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకరూప దుస్తులు తయారు చేసేందుకు జిల్లాలో 78 కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా వారికి అవకాశం కల్పిస్తూ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, తద్వారా మహిళలకు ఉపాధి కల్పించడం జరిగిందని తెలిపారు. కుట్టు కేంద్రాలలో కొనసాగుతున్న ఏకరూప దుస్తుల తయారీ పురోగతిపై ఏపీఎంలు, సీసీలు ప్రతిరోజు పర్యవేక్షించాలని, ప్రతి కుట్టు కేంద్రంలో 10 మంది మహిళలు దుస్తులు తయారు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోజు వారి లక్ష్యాలను సాధించే విధంగా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. నిర్దేశిత గడువులోగా ఏకరూప దుస్తులు అందించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని, దుస్తుల తయారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్




నవతెలంగాణ-కాగజ్‌నగర్

నకిలీ విత్తనాలు విక్రయించేవారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని వినయ్ గార్డెన్‌లో శనివారం ఎరువులు, విత్తన దుకాణాల డీలర్లు, వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. నకిలీ, కాలంచెల్లిన విత్తనాలు, నిషేదిత పురుగు మందులు అమ్మితే ఉపేక్షించమన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయశాఖ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా బృందాలను ఏర్పాటు చేసి నిఘా పెట్టామన్నారు. బిల్లులు లేకుండా విడిగా విత్తనాలు విక్రయిస్తే పోలీసులకు గాని, వ్యవసాయశాఖ అధికారులకు గాని సమాచారం అందించాలన్నారు. డీలర్లు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని, నాసీరకం, నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు జిల్లాలోకి, రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. నకిలీ విత్తనాలు అమ్మకుండా వ్యవసాయశాఖ అధికారిలు నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సురేష్, డీఎస్పీ కరుణాకర్, ఏడీఏ మనోహర్, వ్యవసాయశాఖ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

# భూముల కౌలు వేలంతో రూ.15లక్షల ఆదాయం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కేశవనాథస్వామి ఆలయ ఆధీనంలో ఉన్న భూముల ఒక సంవత్సరం కౌలు వేలంతో రూ.15,16,000 వచ్చినట్లు దేవాలయ కార్యనిర్వాహణాధికారి గర్రెపల్లి వేణుగోపాలగుప్త తెలిపారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ సంఘం మినీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన దేవాలయ భూముల కౌలు వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్కాపూర్ గ్రామంలో గల సర్వే నంబర్ 80/ఎఅండ్‌బి, 81, 82, 83, 84కు ఒక సంవత్సర కాల పరిమితికి సాగుకు కౌలు చేయడానికి బహిరంగ వేలంలో 12 మంది రైతులు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొన్నారని తెలిపారు. జనకాపూర్ గ్రామంలో గల ఆరు సర్వే నెంబర్లలో ఐదు సర్వే నంబర్లకు వేలంపాట పాడారని, ఐదు సర్వే నంబర్లకు మొత్తం రూ.15,16,000 వచ్చిందని పేర్కొన్నారు. గత సంవత్సరం ఇవే భూములకు మొత్తము రూ.14,36,000 వచ్చాయని, గత సంవత్సరంతో పోల్చితే రూ.80,000 అదనంగా వచ్చినట్లు తెలిపారు. ఇదే శివారులో సర్వే నెం.85లో వేలం పాట ఆపివేసినట్లు, త్వరలోనే దాని తేదీలు ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాపూర్ శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం కార్య నిర్వహణ అధికారి గుర్రాల బాపిరెడ్డి, గ్రామ పెద్దలు దేవాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ వైరాగడే మనోజ్‌కుమార్, దేవాలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐపీఎల్ ఫైనల్‌లో హైదరాబాద్ గెలవాలని ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఐపీఎల్‌లో ఆదివారం హైదరాబాద్ వర్సెస్ కోల్‌కతాతో జరిగే ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ గెలవాలని కోరుతూ శనివారం ఇందల్‌వాయి రామాలయంలో ప్రత్యేక అర్చన పూజలను ఇందల్‌వాయి ఆరెంజ్ ఆర్మీ అభిమానుల ఆధ్వర్యంలో చేశారు. ఈ సందర్భంగా లోకాని గోపీ, అశోక్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జరిగిన 16 సీజన్‌లో ఒకేసారి హైదరాబాద్ ఐపీఎల్ ట్రోఫీ గెలిచిందని, ఈసారి కనీవినీ ఎరుగని రీతిలో హైదరాబాద్ ఫైనల్ పోరుకు సిద్ధమైందన్నారు. ఈసారి ఫైనల్ గెలవాలని దీపక్ పంతులు ఆధ్వర్యంలో అర్చన జరిపించినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇందల్‌వాయి ఆరెంజ్ ఆర్మీ అభిమానులు మాను, విశాల్, సందీప్, బబ్లూ, లోకాని అరుణ్, అరవింద్, అనిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## దాడిచేసిన వారిని శిక్షించాలి

- ఐద్వా డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మైనర్ బాలికను హతమార్చేందుకు ప్రయత్నించిన వారికి శిక్షించాలని ఐద్వా ప్రతినిధులు కోరారు. కెనాల్ కట్ట వద్ద మైనర్ బాలికపై జరిగిన దాడి విషయం తెలుసుకున్న ఐద్వా మహిళా సంఘం నాయకులు జిల్లా అధ్యక్షురాలు అనిత, జిల్లా కార్యదర్శి సుజాత కమిటీ సభ్యులు, జ్ఞానేశ్వరిని ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. అనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, జిల్లా అధ్యక్షురాలు అనిత మాట్లాడుతూ.. యువతి మాట్లాడలేని పరిస్థితిలో ఉందని అన్నారు. అమ్మాయిని ఆటో ఎక్కించికొని హత్యాయత్నానికి పాల్పడిన కసాయి తల్లిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికకు రక్షణ కల్పించి, న్యాయం జరిగే విధంగా పోలీస్‌శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. యువతికి తక్షణమే న్యాయం చేయాలని, లేదంటే న్యాయం జరిగేంతవరకూ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## ఎరువుల దుకాణం ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-పెద్దపల్లి

పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా వద్ద ఎరువుల దుకాణాన్ని పెద్దపల్లి వ్యవ సాయ అధికారిణి అలివేణి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణం లోని ఎరువులు, క్రిమి సంహా రక మందులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఏవో అలివేణి మాట్లాడుతూ ఎరు వుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేస్తున్నామన్నారు. దుకాణం నిర్వా హకులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రికార్డులు మెయింటెన్ చేయాలని, రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలన్నారు. రైతులు ఆధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని,తప్పని సరిగా రసీదులు తీసుకోవాలని సూచించారు. రైతు వేదికల వద్ద అందు బాటులో ఉండే వ్యవసాయ విస్తరణ అధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేసి, ఎరువులు, విత్తనాలు వాడుకోవా లన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే షాప్ లైసెన్స్ రద్దు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-పెద్దపల్లి

రైతన్న కుటుంబాలకు నష్టపో యిన పంటకు ధాన్యానికి గిట్టుబాటు ధర కటింగ్ లేకుండా ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకు రాలు దాసరి ఉష అన్నారు. శనివారం కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్ ఖాన్ పేట గ్రామంలో ఐకేపీ సెంటర్‌ను పరిశీలించి ప్రజల సమస్యలను తెలుసుకున్న పెద్దపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష మాట్లాడుతూ మళ్లీ పంటలు వేసే సమయమైంది కానీ ఇంకా వడ్లు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడడం జరిగిందన్నారు. హనుమంతుని పేట, రాంపల్లి, జాఫర్‌ఖాన్ పేట ఇలా చూసుకుంటే ఎన్నో గ్రామాల్లో ఇంకా కూడా వడ్లను కొనుగోలు చేయలేని పరిస్థితిలో ఉందని, ఇలాంటి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతన్న కుటుంబాలకు నేడు భరోసా లేకుండా పోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జాఫర్‌ఖాన్ పేట గ్రామ శాఖ యూత్ అధ్యక్షుడు, వార్డు మెంబర్ తిప్పాని శ్రావణ్ కుమార్, పాల్గొన్నారు.

## కోర్సినిలో వ్యక్తి దారుణహత్య

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని కోర్సిని గ్రామంలో శుక్రవారం రాత్రి బొట్టుపల్లి సదయ్య(34) దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..సదయ్యకు 12 ఏండ్ల క్రితం మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన కవితతో వివాహం జరిగింది. వారికి ఓ కూతురు సైతం ఉండగానే, సదయ్య అదే గ్రామానికి చెందిన మరో యువతి సౌందర్యతో వివాహయేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య ఆయనను వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. సదయ్య, సౌందర్య మంచిర్యాల తదితర పట్టణాల్లో దాదాపు రెండేళ్ల వరకు ఉంటూ సహజీవనం చేశారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో సౌందర్య అతన్ని వదిలేసి వేరే వ్యక్తిని వివాహం చేసుకుంది. దీంతో సదయ్య సొంత గ్రామానికి వచ్చేశాడు. రేండేళ్లుగా మద్యం తాగుతూ గ్రామంలో తిరుగుతుండేవాడు. శుక్రవారం సౌందర్య తన పుట్టిల్లు అయిన కోర్సిని వచ్చిందని తెలిసి సదయ్య అక్కడికి వెళ్లాడు. ఆమె సోదరుడు ఇంటికి ఎందుకు వచ్చావని నిలదీయడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ముల్కల రాజ్‌కుమార్ దగ్గరలో ఉన్న రాడ్‌తో సదయ్యపై దాడి చేయడంతో తలకు బలమైన గాయం తగిలి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక అసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి మల్లక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

## మహిళలకు చట్టాలపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-రెబ్బెన

ఎస్పీ సురేష్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని ఖైర్గావ్ గ్రామంలో ఉపాధి హామీ పనులకు వెళ్లే మహిళలకు శనివారం షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌కు గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని మహిళలకు రక్షణ కల్పించడం కోసమే షీటీంలు పనిచేస్తున్నాయన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని పేర్కొన్నారు. షీ టీం ఆసిఫాబాద్ డివిజన్ సెల్ 8712670564ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం.ప్రకాష్, షీ టీం సభ్యులు శ్రీలత, స్వప్న పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రకటనను ఖండించిన అంబేద్కర్ సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బుద్ధ జయంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిందని ఇచ్చిన ప్రకటనను అంబేద్కర్ సంఘ నాయకులు ముంజం సాంబయ్య ఖండించారు. బుద్ధ జయంతి తమ ఆధ్వర్యంలో జరిగిందని, అన్నదాన కార్యక్రమాన్ని తాము నిర్వహిస్తే మరొకరు తమ ఖాతాలో వేసుకోవడం సరైంది కాదని పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కౌటాల

పెద్దబండ నుంచి లోనవెల్లి ఫీడర్ వరకు 33కేవి లైన్ మరమ్మత్తుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవిందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాలకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## 2065 జీవాలకు చిటుకు రోగం నివారణ టీకాలు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని ముత్యంపల్లి, చిక్లీ గ్రామాలలో 2065 గొర్రెలకు చిటుకు రోగం టీకాలను పశువైద్య, పశుసంవర్ధక ఆధ్వర్యంలో శనివారం వేశారు. ఈ సందర్భంగా డా.కిరణ్ దేశ్‌పాండే మాట్లాడుతూ మండలంలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన పశువులకు వచ్చే గొంతువాపు, జబ్బువాపు రోగాలకు సంబంధించిన మందులు మండలంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గొర్రెలకు సంబంధించి చిటుకు రోగం సంబంధించిన టీకాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డా.ఉమమా సహీర్, వీఎల్‌ఓటి వివిత, జేయుడి కె.గంగాజమున, సిబ్బంది గంగాధర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని చింతలూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త అశోక్ కుటుంబాన్ని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి శనివారం పరామర్శించారు. అశోక్ ఇటీవల ప్రమాదంలో మరణించిన కాంగ్రెస్ పార్టీ చింతలూరు కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అప్పల రాజన్న, ముప్ప గంగారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేష్, పార్టీ మండల అధ్యక్షులు చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్‌లు కాట్‌పల్లి నర్సారెడ్డి, సాయిరెడ్డి, గంగాధర్, ఎంపీటీసీలు గంగారెడ్డి, ప్రకాశ్, చిన్నారెడ్డి, కోలిప్యాక్ సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్, వసంత్ రావ్, జలంధర్, అబ్బి, సొప్పరి వినోద్, శ్రీనివాస్‌గౌడ్, తొర్లికొండ వినోద్, కలిగోట్ భోజన్న, గంగాధర్, రావి, గన్నా లక్ష్మణ్, శంకర్, జితేందర్ నాయక్, రాజేష్, గంగారెడ్డి, రాజేందర్, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉప్లూర్‌లో గాలివాన బీభత్సం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామంలో శనివారం సా యంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈ గా లివానతో గ్రామానికి చెందిన గుండ్ల రమేష్ ఇంటి రేకుల షెడ్డు బలంగా వీచిన ఈదురు గాలులకు కొన్ని ఇనుప రేకులు ఎగిరిపోగా, ఇంటి షెడ్డు మొత్తం నేల కూలింది. పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లిందని బాధితుడు రమేష్ ఆందోళన వ్యక్తం చేశాడు. ప్రభుత్వమే తమన ఆదుకోవాలని కోరారు.

## ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి సుగుణను కలిసిన నాయకులు



నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను శనివారం ఉట్నూరు మండల కేంద్రంలో మండలంలోని తిమ్మాపూర్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచెయ్యాలని ఆమె వారికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్, మాజీ సర్పంచ్ కనక వెంకటేష్, ఉపసర్పంచ్ చిందం చంద్రయ్య, వార్డు సభ్యులు రాజన్న నాయకులు కె శ్రీనివాస్, కొమురయ్య పాల్గొన్నారు.

## అచలాపూర్ పంచాయతీని సందర్శించిన డీఎల్పీఓ

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి సఫీధర్ అలీ శనివారం మండలంలోని అచలాపూర్ గ్రామపంచాయతీని సందర్శించారు. గ్రామ పంచాయతీ ఆస్తులను తనిఖీచేశారు. గ్రామపంచాయతీలోని పల్లె ప్రకృతి వనాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, స్మశాన వాటిక, సెగ్రిగేషన్ షేడ్, నర్సరీ నిర్వహణ పనులను పర్యవేక్షించారు. ఆయన వెంట అచలాపూర్ పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమర్ ఉన్నారు.

## వర్షాలకు ముందే ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి



నవతెలంగాణ-జైపూర్

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ముందే వరి ధాన్యం కొనుగోళ్లను అధికార యంత్రాంగం పూర్తి చేయాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. జైపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీపీఐ(ఎం) నాయకులు శనివారం సందర్శించారు. ఈ సంధర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యురాలు దాసరి రాజేశ్వరి మాట్లాడుతూ వర్షంలో తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం తప్పా చేతల్లో కన్పించడం లేదని విమర్శించారు. మండల కేంద్రంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు చేస్తున్న తీరును పరిశీలించినట్లు తెలిపారు. పంటలు పండించడంతో పోల్చితే అమ్ముకోవడం అవస్థగా మారిందని జిల్లా కమిటి సభ్యులు దుంపల రంజిత్ కుమార్ అన్నారు. రాత్రింబవళ్ల శ్రమించిన రైతుల చివరికి ధాన్యం విక్రయించడంలో నానా ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోందని ఆవేధన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా వరి ధాన్యం బోనస్ రూ.500 వెంటనే రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. దొడ్డు, సన్నం అనే తేడా లేకుండా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ధాన్యం తూకం వేయడంలో రైతులను దగా చేస్తున్నారని ఆరోపించిన ఆయన జిల్లా అధికారులు ఈ విషయంలో తగు విధంగా స్పందించాలని కోరారు. అధికారుల పర్యవేక్షణ కొరవడిన కారణంగా నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రైతులకు అందుబాటులో గన్ని సంచులు, కేంద్రానికి వచ్చిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయడం, తూకం వేసిన ధాన్యం రవాణా కోసం కేంద్రాల్లో లారీలను అందుబాటులో ఉంచడంపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

## 'ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది'



నవతెలంగాణ-తాండూర్

రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందవద్దని తాండూర్ తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. శనివారం బెల్లంపల్లి ఆర్డీఓ జిల్లా పౌరసరఫరాల అధికారి హరికృష్ణ ఆదేశాల మేరకు మండలంలోని రేచీని ద్వారకాపూర్, తాండూర్ గ్రామాలలో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రైతులతో మాట్లాడుతూ రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఇప్పటివరకు తాండూరు మండలంలో 70 శాతంకు పైగా వడ్ల కొనుగోలు జరిగిందన్నారు. రానున్న రెండు మూడు రోజుల్లో తాండూరు మండలంలోని రైతుల వద్ద నుండి పూర్తిస్థాయిలో వడ్ల కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట తాండూర్ ఆర్ఐ అంజన్‌కుమార్, పీఏసీఎస్ సెక్రటరీ శ్రీనివాస్ ఉన్నారు.

# జల్సాల కోసం ఇండ్లలో దొంగతనాలు

- ఏడుగురు యువకుల అరెస్ట్
- రూ.11 లక్షల 72 వేలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ శ్రీనివాస్



నవతెలంగాణ-మంచిర్యాల

జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించాలని స్థానికంగా, పలు ప్రాంతాల్లో ఇండ్లలో దొంగతనానికి పాల్పడిని ఏడుగురు యువకులను అరెస్టు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం పంట్టణంలోని ఎం కన్వెన్షన్ హాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలను వెల్లడించారు. పాగిడి కార్తీక్, తాటికొండ స్వామిచరణ్, పుప్పాల రాహుల్, గన్నవరం మధూకర్, కుర్సింగ ఈశ్వర్, మడావి రాము, వెద్మ ప్రవీణ్ అనే నేరస్తులు గత కొంత కాలంగా తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడ్డారు. రాత్రి వేళల్లో ఇనుప రాడ్లతో తాళాలను పగలగొట్టి ఇండ్లలోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు, ఇతరత్రా సామాగ్రిని దొంగిలిస్తూ వాటిని విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అలా దొంగతనం చేసిన సొత్తును కరీంనగర్‌కు వెళ్లి అమ్మేందుకు నిర్ణయించుకొని అదే ముఠాలోని నిందితుడైన మంచిర్యాల పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన స్వామిశరణ్ అలియాస్ మున్నా ఇంట్లో ఉన్నట్లు సమాచారం తెలిసి వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారని తెలిపారు. వారి వద్ద రూ.9.22 లక్షల విలువ గల బంగారు ఆభరణాలు, రూ.60 వేల వెండి ఆభరణాలు, రూ.50వేల విలువ గల బైక్, రూ.1.20 లక్షల విలువ గల టీవి, హోమ్ థియేటర్, రూ.20వేల విలువ గల గిటార్, మొత్తం రూ.11.72 లక్షల విలువ గల సొత్తును రికవరీ చేయడం జరిగిందని చెప్పారు. జనవరి నెల నుంచి మే నెల వరకు జరుగుతున్న వరుస దొంగతనాలపై దృష్టి సారించిన పోలీస్ శాఖ సివిల్, సీసీఎస్ పోలీసులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయటంతో నేరస్తులను పట్టుకునేందుకు ఆ బృందం కృషి చేసిందని తెలిపారు. నేరస్తులను పట్టుకునేందుకు విధుల్లో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులు, సిబ్బందిని సీపీ ప్రత్యేకంగా అభినందించడంతో పాటు వారికి రివార్డులు అందించారు. మంచిర్యాల, బెల్లంపల్లి ఏసీపీలు ప్రకాష్, రవికుమార్, మంచిర్యాల టౌన్ సీఐ బన్సీలాల్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# నకిలీ విత్తనాలు తీసుకొని మోసపోవద్దు

- మండల వ్యవసాధికారి సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

రైతులు నకిలీ విత్తనాలు గునుగోలు చేసి మోసపోవద్దని మండల వ్యవసాయ అధికారి సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని బలరావుపేట్, మిట్టపల్లి, ఉత్కూర్, మోదెల, హన్మంతు పల్లి గ్రామాలలో రైతులకు నకిలి విత్తనాలు, విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వదులుగా ఉన్న సంచులలో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయొద్దన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి తప్పని సరిగా రశీదు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆ రశీదును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకత డీలర్స్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తన పాకెట్ మీద తయారయిన తేది, కాల పరిమితి తప్పక చూసుకోవాలని, గ్రామాలలో తక్కువ ధరకు, ఎక్కువ ధరకు అమ్మిన వారి వివరాలు మండల వ్యవసాయ అధికారికి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు గోవర్ధన్‌రెడ్డి, ప్రసన్న, ఇర్ఫాన్ యష్మీన్, శ్రీనివాస్, అనూష పాల్గొన్నారు.



లక్షెట్టిపేటలో..

రైతులతో సమావేశమైన ఆయన విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహణ కల్పించారు. లూజుగా విక్రయించే విత్తనాలు కొనుగోలు చేయకూడదని, విత్తనాలు విక్రయిస్తున్న దుకాణం నుంచి రశీదు తీసుకోవాలని తెలిపారు. విత్తన ప్యాకెట్‌తో పాటు తీసుకున్నటువంటి రశీదు పంట కాలం చిరి వరకు బద్రపర్చుకోవాలని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీటీఎం విశ్వనాథ్, రైతులు పాల్గొన్నారు.

**జైపూర్ :** ఖరీఫ్ పంటల సాగుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రైతులు విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని భీమారం వ్యవసాయ విస్తరణ అధికారి అరుణ్ కుమార్ సూచించారు. శనివారం కాజిపల్లి, నర్సింగాపూర్‌లలో



జైపూర్ : భీమారంలో అవగాహన కల్పిస్తు ఏఈఓ అరుణ్ కుమార్

**తాండూర్ :** రైతులు ప్రభుత్వ అనుమతి పొందిన నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ తెలిపారు. శనివారం మండలంలోని కొత్తపల్లి, రేచీని, ద్వారకాపుపూర్ గ్రామాల్లో విత్తనాల ఎంపికపై రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలిపారు. నకిలి విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు వేసవి దుక్కులు సకాలంలో పూర్తి చేసుకొని వానాకాలం సాగుకు సంసిద్ధం కావాలని చెప్పారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పని సరిగా రశీదు తీసుకొని దానిని పంటకాలం పూర్తి అయ్యే వరకు భద్రపరచుకవాలని సూచించారు. డీలర్లు విత్తనాలను ఎమ్మార్పీ ధరకంటే అధికధరలకు అమ్మినట్లు అయితే వ్యవసాయ అధికారులకు పిర్యాదు చేయలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో వ్యవసాయ విస్తరణ అధికారులు శంకర్, ధనలక్ష్మి పుష్పలత పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో కేసులు సత్వర పరిష్కారం

- డీఎల్ఎస్ఏ చైర్మన్ బోయ శ్రీనివాసులు



నవతెలంగాణ-మంచిర్యాల

ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఎటువంటి కేసులైనా లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్మన్ బోయ శ్రీనివాసులు తెలిపారు. శనివారం జిల్లా కోర్టులో మంచిర్యాల పరిధిలోని ఏసీపీలతో సమావేశం ఏర్పాటు చేశారు. జూన్ 8వ తేదిన జాతీయ లోక్ అదాలత్ ఉన్నందున జిల్లా కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, ఎక్సయిజ్ కేసులు రాజీ మార్గంలో పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. ఎటువంటి న్యాయ సలహాల కోసం అయిన జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించాలని కోరారు. దాదపు 9 వేళా కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే విధంగా జిల్లా పొలిసు యంత్రంగం గుర్తించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ జడ్జి కె నిరోషా పాల్గొన్నారు.

## సేఫ్టీ సమావేశం బహిష్కరణ



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో శనివారం నిర్వహించిన సేఫ్టీ సమావేశాన్ని గుర్తింపంఉ సంఘం నాయకులు బహిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య మాట్లాడుతూ సీహెచ్‌పీ డీజీఎం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని, రక్షణ సూత్రాలను పాటించడం లేదని, రక్షణ గురించి అడిగిన కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గతంలో శ్రీరాంపూర్ జీఎం సీహెచ్‌పీ పర్యటనలో భాగంగా మహిళా కార్మిక సోదరీమణులను పని ఎలా ఉందని అడిగినందుకు వారి సమస్యలు జీఎంకు విన్నవించడం వల్ల దానిని దృష్టిలో పెట్టుకొని మహిళా కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. గత సేఫ్టీ సమావేశంలో గుర్తింపు సంఘంగా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లిన ఇప్పటి వరకు వాటి పరిష్కారం చేయనందున సేఫ్టీ కమిటీ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఫిట్ కార్యదర్శి చల్ల తిరుపతి, సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కాసిపేట-2 గనిపై ఏఐటీయూసీ నిరసన

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిపై కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గని మేనేజర్ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. గ్రూప్ ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ లక్ష్మీ నారాయణకు కార్మికుల సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. ఈ సంధర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ కొత్త ఎస్డీఎల్ యంత్రాలను తెప్పించాలని, మ్యాన్ రైడింగ్ ను వెంటనే ప్రారంభించాలని, గనిలో నార్త్‌లో వెంటిలేషన్ మెరుగు పర్చాలని, గనిలో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉంచాలని, బైక్ షెడ్ నిర్మించాలని, రెస్ట్ హాల్స్‌ను నిర్మించాలని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారులు ఇచ్చిన హామీ మేరకు సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాలు చేపడుతామని, దీనికి యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ ఎండీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, ఉపాధ్యాక్షుడు బియ్యాల వెంకటస్వామి, రామకృష్ణాపూర్ బ్రాంచ్ ఉపాధ్యాక్షుడు ఇప్పకాయ లింగయ్య, ఫిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, బొద్దుల వెంకటేశ్, చంద్రయ్య నీలయ్య, సుర మల్ల వినయ్ కుమార్ పాల్గొన్నారు.

## వడ్డీ రిఫండ్ వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-నస్పూర్

ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో కార్మికులకు ఇచ్చే రూ.పది లక్షల వడ్డీ రిఫండ్ వెంటనే ఇవ్వాలని ఐఎన్టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం బ్రాంచ్ నాయకులతో కలిసి ఎస్ఆర్పీ వర్క్ షాప్‌ని సందర్శించి, కార్మికులను కలుసుకొని వారి సమస్యలను తెలుసుకుని ఆ సమస్యల పరిష్కారం కోసం ఏరియా వర్క్ షాప్ డీవైజీఎంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెట్టి శంకర్ రావు మాట్లాడుతూ శ్రీరాంపూర్ వివిధ గనులలో పనిచేస్తున్న 230 మంది మహిళా కార్మికులకు మోటార్ వైడింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించి మహిళా కార్మికులందరిని ఏరియా వర్క్ షాప్‌లోనే ఉద్యోగం చేసుకునే విధంగా యజమాన్యం ఏర్పాటు చేయాలని, మహిళలకు ప్రత్యేక రెస్ట్ హల్ ఏర్పాటు చేయాలని అన్నారు. కార్మికుల పిల్లలకు సీబీఎస్ఈ సిలబస్‌తో సింగరేణి పాఠశాలలో చెప్పుటకు ప్రత్యేక టీచింగ్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని, డ్రైవర్స్‌కు అందరిలాగే ప్లేడేలు కల్పించాలని, వర్క్ షాప్ కార్మికులకు నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలని, అలాగే వర్క్ షాప్‌లో ఆఫీస్ స్టాఫ్‌కి పర్మినెంట్ క్లర్క్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, కేంద్ర కార్యదర్శి బ్రహ్మచారి, ఏరియా కార్యదర్శులు వెంకటేశ్వర్లు, గణపతి మహేష్, తోకల వెంకటస్వామి, నీలం సదయ్య ఏరియా అసిస్టెంట్ సెక్రటరీ మోహన్, మహేష్, రాజు, రామస్వామి, ఫిట్ సెక్రెటరీ రమేష్ పాల్గొన్నారు.

# కరెంట్ కోతలతో ఇబ్బందులు

- అంతిమ సంస్కారానికి ఆటంకం
- నీళ్లు లేక స్నానాలకు ఇబ్బందులు

నవతెలంగాణ-జైపూర్

మరమ్మతుల పేరుతో గంటల తరబడి విద్యుత్ కోతలు విదిస్తుండటం సమస్యగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. గత వారం రోజులుగా మండుతున్న ఎండలతో జనాలు బెంబేలెత్తుతుంటే మరో వైపు కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు కోతలతో అంత్యక్రియలకు ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటన చోటు చేసుకుంది. చనిపోయిన మనిషి అంతిమ సంస్కారాలకు కూడా విద్యుత్ కోత ఆటంకం కలిగించిందంటే కరెంటు కోతలు ఏవిదంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. భీమారం మండల కేంద్రానికి చెందిన కుమ్మరి శంకరమ్మ అనారోగ్యంతో మృతిచెందగా ఆమె దహన సంస్కారాలకు విద్యుత్ కోత ఆటంకం కలిగించింది. శంకరమ్మ మృతదేహానికి దహన సంస్కారాలు చేసిన కొడుకు స్నానం చేయాల్సివుటుంది. విద్యుత్ కోత కారణంగా మోటార్లు పని చేయకపోవడంతో తప్పనిసరై ఒక మనిషి ఆర్వోప్లాంట్ వద్దకు వచ్చి క్యాన్‌తో నీళ్ల తీసుకురావల్సి వచ్చింది. ఇక్కడ మరో గమ్మత్తు ఏమిటంటే ఆర్వో ప్లాంట్‌లో కూడా అంతంతమాత్రంగా నీళ్లుడటం మంచిదైంది. ఆర్వో ప్లాంట్ నుంచి నీళ్ల తీసుకొస్తే తప్పా దహణ సంస్కారాలు చేయలేని పరిస్థితుల్లో అంతిమయాత్రలో పాల్గొన్నవారందరు మిషన్ భగీరథ పైప్‌లైన్‌లో ఉన్న నీటితో స్నానాలు ముగించాల్సి వచ్చింది. అందుబాటులో చేదబావులు లేవు.. ఉన్నా చేద బావుల్లోని నీరు ఎప్పుడో ఎండిపోగా హ్యాండు బోర్లు అసలే లేవు. విద్యుత్ సరఫరా ఉంటే తప్పా భూగర్భంలోని నీరు అవసరాలు తీర్చదు. ఇలాంటి పరిస్థితుల్లో అరగంట, గంట కోత విదిస్తే సర్దుకోవచ్చు.. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిరంతరాయంగా కోత విధించడం వినియోగదారులను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తోంది. గత నెల రోజుల నుండి ప్రతి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి వారంలో ఒకటి రెండు సార్లు విద్యుత్ కోత విధించడం పరిపాటిగా మారింది. అధికారికంగా విదిస్తున్న కోతలతోనే ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అనధికారికంగా కోతలు విధిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మరమ్మత్తు పనుల పేరుతో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో అనారోగ్యులు, చంటి పిల్లలు, వృద్దులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.



జైపూర్ : భీమారంలో అంత్యక్రియలు నిర్వహించి మిషన్ భగీరథ నీటితో స్నానం చేస్తున్న బంధువులు

## రైతులను గాలికొదిలి విదేశాల్లో విహరిస్తున్న ఎమ్మెల్యే

- బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్

నవతెలంగాణ-జైపూర్

అకాల వార్షలతో అతలాకుతలమవుతున్న రైతులను గాలికి వదిలేసి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి విదేశాల్లో విహరిస్తున్నాడని బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్ ఆరోపించారు. కోటపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంధర్శించారు. ఈ సందర్భంగా చెన్నూర్ ఎమ్మెల్యే రైతులను నిర్లక్ష్యం చేస్తున్నాడని విమ్మర్శించారు. గత ప్రభుత్వంలో అప్పటి మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ రైతులకు వెన్నుదున్నుగా నిలిచారని ఆస్పత్రిలో ఉన్న తండ్రి వదిలేసి రైతులకు అండగా వరి ధాన్యం కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారని అన్నారు. కనీసం అధికారులైనా స్పందించాలని, కొనుగోలు కేంద్రాలకు తరలివచ్చే ధాన్యం ఎప్పటికప్పుడు తూకం వేసే విదంగా నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రైతులకు న్యాయం చేయడంలో కృషి చేస్తున్న అధికారులకు, రైతులకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా రైతులకు సహాయంగా మిల్లర్లు వ్యవహరించాలని మిల్లుకు వచ్చిన ధాన్యం ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేసుకోవాలని ఈ సందర్భంగా మిల్లర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మెన్ సాంబగౌడ్, మాజీ సర్పంచ్ గోనె సత్యనారాయణ రావు, మండల యూత్ అధ్యక్షుడు మారిశెట్టి విద్యాసాగర్, ఉపాధ్యక్షుడు ఆసంపల్లి సంపత్ కుమార్, నాయకులు సందీప్‌రెడ్డి, దుర్గ మల్లయ్య పాల్గొన్నారు.



## ప్రశాంతంగా గురుకుల కౌన్సెలింగ్

నవతెలంగాణ-ఉట్నూర్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని లాల్ టెక్డీ, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ఇచ్చోడ గిరిజన గురుకుల బాలురు కళాశాలలో ప్రవేశాలకు శనివారం ఉట్నూర్ మండలంలోని లాల్ టెక్డీ గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్ మొదటి సంవత్సరంలో మెరిట్ ఆధారంగా 450 మంది విద్యార్థులకు సీట్లు భర్తీ చేశామని ఆర్సీఓ గంగాధర్ తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌లో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిగ్రీ పరీక్ష కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-రెబ్బెన



రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజ్ పరీక్ష కేంద్రాన్ని కాకతీయ యూనివర్సిటీ అడిషనల్ కంట్రోలర్ తిరుమల దేవి శనివారం తనిఖీ చేశారు. ఈ కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల రెండవ, నాలుగవ, ఆరవ సెమిస్టర్ల పరీక్షలు 20 రోజులుగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ పరీక్షలు జరుగుతున్న తీరును ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆమె వెంట కళాశాల ప్రిన్సిపల్ జాకీర్ ఉస్మాని, అబ్జర్వర్ డాక్టర్ కాంపల్లి శంకర్, ఇన్విజిలేటర్లు ఉన్నారు.

## పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-సారంగాపూర్

మండల పోలీస్‌స్టేషన్‌ను శనివారం నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ఏ విధంగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలో సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## కలప పట్టివేత



నవతెలంగాణ-సిరికొండ

ఇంట్లో నిల్వ ఉన్న కలపను పట్టుకున్న సంఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. డిప్యూటీ రేంజ్ అధికారి గీరయ్య తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని కమ్మరి రవి అనే వడ్రంగి ఇంట్లో సోదాలు నిర్వహించామని అన్నారు. దాదాపుగా రూ.30వేల కలపను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. కలపతో పాటు కలపను కట్ చేసే యంత్రాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా కలప స్మగ్లింగ్‌కి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ ఈశ్వర్, బెస్ క్యాంపు సిబ్బంది నిరంజన్, జంగు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు తయారు చేసేవారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-జైనథ్

నకిలీ విత్తనాలు తయారు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల కిసాన్ మోర్చ అధ్యక్షులు రాకేష్‌రెడ్డిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఒక వ్యాపారం లాగా నడుస్తుందని, నకిలీ విత్తనాలు తయారీ చేస్తున్న వ్యక్తులపై నాన్ బెయిలేబుల్ కింద కేసులు నమోదు చేయాలని అన్నారు. ఆరు కాలం రైతులు కష్టపడి పంటలు పండించి బాగుపడుదామనుకుంటే కొంతమంది రైతులను మోసం చేయడానికి నకిలీ విత్తనాలు తయారు చేయడం సరికాదని అన్నారు. యావత్ ప్రపంచానికి అన్నం పెట్టె రైతులకు ఈ నకిలీ విత్తనాలు తయారు చేసి రైతులని నిండా ముంచుతున్నారు. టాస్కఫోర్స్ అధికారులు ప్రతి విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిడం రాకేష్, సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

## పోలీసు కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ కొండిబారావ్ (ఎస్సి) మాతృమూర్తి ఇటీవలే మరణించింది. విషయం తెలుసుకున్న ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ ఆయన స్వస్థలం ఇంద్రవెల్లిలోని గౌరాపూర్ గ్రామంలో శనివారం పరామర్శించారు. అతని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో కాటం రమేష్, సింగారే భారత్, దావుల రమేష్ ఉన్నారు.

## నేడు ఖానాపూర్‌లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అంతరాయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని కోరారు.

## రేపు ఏకలవ్య కళాశాల కౌన్సెలింగ్

నవతెలంగాణ-ఉట్నూర్

2023-24 విద్యా సంవత్సరానికి ఆంగ్ల మాధ్యమంలో పదో తరగతి ఉత్తర్ణులైన బాలబాలికలు మే 21 వరకు దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే మే 27న నిర్వహించే ఏకలవ్య గురుకుల మొదటి సంవత్సరం కౌన్సెలింగ్‌లో టీసీ, బోనాఫైడ్, క్యాస్ట్, ఇన్కమ్, ఆధార్ పాస్ ఫోటోలతో హాజరు కావాలని శనివారం ఆర్సీఓ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి, సిర్పూర్(టి) నాలుగు కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో భర్తీ చేస్తున్నామని, ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్ ఈఎంఆర్ఎస్ పాఠశాల(ఏకలవ్య)లో 27న హాజరు కావాలని కోరారు.

# జిల్లాలో పర్యటించిన వివాదాల పరిష్కార కమిషన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ రాష్ట్ర ఇన్‌చార్జి అధ్యక్షురాలు మీనా రామనాథన్ జిల్లాలో శనివారం పర్యటించారు. ఆమె జిల్లాకేంద్రంలోని కోర్టులోని కమిషన్ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలపై ఆరా తీశారు. సిబ్బందికి పలు అంశాలపై సూచనలిచ్చారు. ఏమైన లోటుపాట్లు ఉంటే సవరించుకోవాలన్నారు. ఏమైన సమస్యలు, ఇబ్బందులుంటే తమ దృష్టికి తేవాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచిసేవలు అందించే విధంగా అందరూ తమవంతు కృషి చేయాలని తెలిపారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రెగ్యులర్ తనిఖీల్లో భాగంగానే ఇక్కడకు వచ్చినట్టు పేర్కొన్నారు. సిబ్బంది పనితీరు, రికార్డుల మెయింటేనెన్స్, తదితర అంశాలపై పరిశీలించి సూచనలు చేసినట్టు వివరించారు. చాలా కాలం తర్వాత ఇక్కడకు రావడం జరిగిందని, అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని వెల్లడించారు. ఆ తర్వాత బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఎన్నాల నగేష్ సమక్షంలో న్యాయవాదులు ఆమెకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాదరంగా ఆహ్వానించి శాలువాలు, పూలబొకేలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల కమిషన్ జిల్లా చైర్మెన్ జాబేద్ శ్యామూల్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# సంస్కృతిని కాపాడుకోవాలి : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసులు సంస్కృతిని కాపాడుకోవాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని లక్కెటిపేట గ్రామంలో 'భావె మహినా' సందర్భంగా అర్క పరివార్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని పెర్సాపేన్‌లకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేని శాలువాలతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివాసులు ప్రకృతిని దైవంగా భావించి, ఎంతో నియమ నిష్టలతో పూజలు చేసి తమ సంస్కృతి, సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను యావత్ ప్రపంచానికి చాటి చెప్పడం జరుగుతుందని పేర్కొన్నారు. నేటి యువత వాటిని మర్చిపోతున్నారన్నారు. తమ ముత్తాతల కాలం నుంచి ఆచరిస్తున్న సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఎంతైన ఉందని తెలిపారు.



ఈ కార్యక్రమంలో అర్క కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# నమ్మించి మోసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు

నవతెలంగాణ-ఖానాపూర్

ఒక వ్యక్తిని నమ్మించి మోసం చేసిన ఇరువురుపై శనివారం కేసు నమోదైనట్టు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ పట్టణంలోని బర్కత్‌పురాకు చెందిన అసద్ అలీ అమెరికాలో కుటుంబంతో నివసిస్తున్నాడు. కాగా ఖానాపూర్ లో ఉండే తన తల్లిదండ్రుల బాగోగులు చూడటానికి, హాస్పిటల్స్ బిల్లులు, మందుల కోసం, రోజువారీ ఖర్చుల కోసం అదే కాలనీకి చెందిన షార్జిల్ అహ్మద్‌కు తన ఏటీఎం కార్డ్‌ను ఇచ్చి అందులో డబ్బులు పంపిస్తున్నాడు. కాగా షార్జిల్ అహ్మద్, అతని భార్య హుమేరా యాస్మీన్ భార్య భర్తలు ఇద్దరూ కలిసి మోసం చేయాలనే దురుద్దేశంతో బ్యాంక్ నుంచి అలర్ట్ మెస్సేజ్ ఫోన్ నెంబర్‌ను మార్చారు. అనంతరం అసద్ అలీ అకౌంట్‌లో నుంచి రూ.60 లక్షలు తెలియకుండా విత్‌డ్రా చేసి తమా అవసరాలకు వాడుకొని మోసాగించారు. ఈ విషయమై భార్య భర్తలను నిలదీయగా రూ.12లక్షల విలువైన ప్లాట్లు ఇచ్చి, మిగితా రూ.48 లక్షల ప్రమీసరి నోట్ ఇచ్చి చెల్లించవకపోవడంతో న్యాయం కోసం ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## ఏజెన్సీలో నకిలీ విత్తనాల బెడద అరికట్టాలి

- రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న



నవతెలంగాణ-ఇచ్చోడ

ఏజెన్సీ గ్రామాల్లో నకిలీ విత్తనాల బెడద అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో స్థానిక రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన పత్తి, సోయాబిన్ విత్తనాలను ప్రభుత్వం సర్టిఫైడ్ చేసిన విత్తనాలను అందించాలన్నారు. దీనిపైన జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, విజిలెన్స్, టాస్కపోర్స్ అధికారులు కలిసి నకిలీ విత్తనాలు అమ్మేవారి పైన దృష్టి సారించాలని అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్ల పైన కఠిన చర్యలు తీసుకొవాలని వారి పైన ఏజెన్సీని రద్దు చేసి, పీడీ యాక్ట్ నమోదు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విత్తన రాయితీ చట్టాన్ని అములు చేసేవిదంగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతులు విష్ణు, ప్రకాష్, రాము, ఆనంద్‌రావ్ పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు హార్వెస్టర్‌లో ఇరుక్కొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని దర్శనం కనకయ్య(42) తన హార్వెస్టర్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం వరి కోతలు పూర్తి కావడంతో హార్వెస్టర్‌పై ఉన్న ట్రాక్టర్‌ను కిందకు దించే క్రమంలో హార్వెస్టర్ కింద కూర్చొని రెండు జాకిలను బిగిస్తుండగా జాకి జారిపోయింది. కనకయ్య మెడపై హార్వెస్టర్ మిషన్ పడడంతో అందులోనే ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటికి పెద్ద దిక్కు మరణించడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయనకు ముగ్గురు కూతుర్లు ఒక్క కుమారుడు ఉన్నారు. బతికున్నాడేమోనని ఆశతో ఇరుగు పొరుగు వారు జేసీబీ సహాయంతో హార్వేస్టాల్‌ను కనకయ్యపై నుండి ప్రక్కకు జరిపించారు. హుటాహుటిన అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ పరీక్షించి మరణించాడని నిర్ధారించాడు. కనకయ్య భార్య దర్శనం సాయవ్వ ఫిర్యాదుతో ఎస్ఐ ఎం.హనుమాన్లు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



## నిత్యావసర సరుకుల పంపిణీ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలో గత రెండు రోజుల కింద కురిసిన అకాల వర్షానికి ఇండ్లు పాక్షికంగా దెబ్బతినగా బాధిత కుటుంబాలకు శనివారం బరంపూర్ మహాలక్ష్మి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి స్వచ్ఛంద సంస్థ సభ్యులు మాట్లాడుతూ తమ వంతుగా గ్రామ గిరిజనులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశామని తెలిపారు. మానవసేవయే మాధవసేవ అనే భావంతో తమ వంతుగా గిరిజనులకు సాయం అందజేసినట్టు తెలిపారు. మిగతా దాతలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గిరిజనులను ఆదుకోవాలని కోరారు. మహాలక్ష్మి స్వచ్ఛంద సంస్థ నాయకులు గోక జీవన్‌రెడ్డి పాట్నా నర్సయ్య, ప్రభు, కుషన్‌పల్లి గంగారాం, చింతల గంగారాం, తలారి అజయ్, గంగాధర్, మాజీ ఉపసర్పంచ్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ రాము, మండల ఆదివాసీ నాయకులు కుమ్ర జ్ఞానేశ్వర్, కృష్ణ పటేల్, కుమ్ర ఇస్రు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాల సదనాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి



నవతెలంగాణ-సారంగాపూర్

నిర్మల్ మండలంలోని కొండాపూర్‌లోని మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనమును సీనియర్ సివిల్ జడ్జి జి.రాధిక శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి నెల సందర్శిస్తానని తెలిపారు. పిల్లలతో ముఖాముఖి మాట్లాడి పలు విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎ.నాగమణి, బాలల సంక్షేమ సమితి సభ్యురాలు సల్ల శ్రీలత, ఇన్‌చార్జీ సూపరింటెండెంట్ ఎం.కవిత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి దేవి, మురళి, న్యాయవాదులు రాజలింగం, లింగాగౌడ్, నరేందర్ జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది ఎస్.రాజు, శ్రీరామ్ మూర్తి, శైలజ, కరుణ, నరేందర్, సుమలత పాల్గొన్నారు.

## ఇఖ్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ సెమినార్



నవతెలంగాణ-ఖానాపూర్

ఇఖ్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఖానాపూర్ పట్టణంలోని ఉర్దూ భవన్‌లో కెరీర్ గైడెన్స్ సెమినార్‌ను నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్యఅతిథిగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నజీర్‌ఖాన్ హజరై మాట్లాడారు. విద్యార్థులు తమ భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి, ప్రజలకు సేవ చేయాలని అన్నారు. క్రమశిక్షణగా ఉండి భవిష్యత్తు లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఇఖ్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యారంగంలో సేవలు అందించడానికి ఎల్లప్పుడూ తమ ఫౌండేషన్ ముందుంటుందని నిర్వాహకులు షోయబ్ అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంఈఏ జనరల్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్, టీఎంఈఏ నెబర్ వహీద్ ఖాన్, షేక్ ఇమ్రాన్, సజ్జాద్ అలీ, ఆమేర్, షేర్ ఇర్ఫాన్, షెహన్, ఘాఫ్ఫుర్, సఫ్దర్, విద్యార్థులు, సంరక్షకులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పైడిపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో విగ్రహ ప్రతిష్ఠాపన అంగరంగ వైభవంగా నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన హనుమాన్ విగ్రహాన్ని వేద పండితులు, దేవాలయ నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగ శ్రీరామ యజ్ఞం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా హనుమాన్ భక్తులు, మండలంలోని ఇంధన్ పెల్లి హనుమాన్ ఆలయం నుంచి, డీజే సప్పులతో, పైడిపల్లి హనుమాన్ ఆలయం వరకు పెద్ద ఎత్తున ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. నూతన విగ్రహ ప్రతిష్టాపన అనంతరం, హనుమాన్ భక్తులు వివిధ గ్రామాలకు చెందిన, శ్రీరామ భక్తులు, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన హనుమాన్ శ్రీ రాముని భక్తులు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## విత్తన డీలర్లకు నోటీసులు

నవతెలంగాణ-బేల

మండలంలో ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నారని తెలిసిన తమకు సమాచారం అందించాలని, రైతులకు తగినంత అవసరమైన విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని, ఎవరు కూడా ఆందోళన చెందవద్దని జైనథ్ సీఐ సాయినాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో టాస్కఫోర్స్ ఆధ్వర్యంలో పలు విత్తన దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రకాల విత్తన ప్యాకెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానం ఉన్న విత్తన ప్యాకెట్‌ల నమూనాలను సేకరించారు. మహారాష్ట్ర రైతులకు విక్రయిస్తున్న పలు విత్తన డీలర్లలకు నోటీసులు అందించామని అన్నారు. ఈ సందర్భంగా సీఐ సాయినాథ్ మాట్లాడుతూ టాస్కఫోర్స్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విత్తన దుఖాణాల్లో తనిఖీలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ తనిఖీల్లో టాస్కఫోర్స్ సిబ్బంది ఏఓ వెండి విశ్వామిత్ర, ఎస్సై రాధిక, తహసీల్దార్ సవాయి సింగ్, ఏఈఓలు ఉన్నారు.

## ఆస్పత్రిని ఎత్తివేసే ఆలోచన విరమించుకోవాలి

నవతెలంగాణ-తాండూర్

సింగరేణి యాజమాన్యం బెల్లంపల్లి సింగరేణి ఆస్పత్రిని ఎత్తి వేసే ఆలోచన విరమించుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శనివారం బెల్లంపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బెల్లంపల్లి సింగరేణి ఆస్పత్రికి పూర్వ వైభవం వచ్చేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటానని తెలిపారు. స్థానిక జనరల్ మేనేజర్ బెల్లంపల్లి సింగరేణి ఆసుపత్రిలో తగినన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆస్పత్రిలో డాక్టర్లు సిబ్బంది నియామకం వసతుల కల్పనపై సింగరేణి సీ అండ్ ఎండీతో చర్చిస్తానని తెలిపారు. స్థానిక కార్మికులు ఆందోళన చెందవద్దన్నరు. బెల్లంపల్లి ఏరియా హాస్పిటల్‌కు పూర్వ వైభవం తెచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా బెల్లంపల్లిలో ఇండ్ల పట్టాలు రానివారు ఆందోళన చెందవద్దని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇండ్ల పట్టాలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఐఎన్టీయూసీ నాయకులు సిద్ధంశెట్టి రాజమౌళి, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు మల్లారపు చిన్నరాజు, రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి పాల్గొన్నారు.

## ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య

నవతెలంగాణ-కౌటాల

మద్యానికి బానిసై తాగిన మైకంలో శనివారం చెట్టుకు ఉరివేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం..మండలంలోని ముత్తంపేట్ గ్రామానికి చెందిన కారం పెంటు(75) తాగుడుకు బానసై శనివారం తాగిన మైకంలో ఊరు సమీపంలోని వ్యవసాయ భూమిలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూతురు అమృత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుకర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.